

సాంకేతిక విద్యతో బంగారు భవిత

పది విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలీసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 15లోపు అప్లికేషన్ సబ్‌మిట్ చేసుకోవాలి. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని॥ (సా॥)	సహార్ ఆది॥ (ఉ॥)
కడప	6.31	5.07
పులివెందుల	6.33	5.12
ప్రొద్దుటూరు	6.32	5.11

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.6/23.2

జిల్లాలో శుక్రవారం 23.2 - 39.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

తూకం తప్పుతోంది!



కాసుల దాహంతో వ్యాపారులు చేస్తున్న మోసం.. కళ్లు మూసుకుని నిద్ర నటిస్తున్న అధికారుల నిర్లక్ష్యం.. వెరసి వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా నిత్యావసర వస్తువుల తూకాల్లో పట్టు తప్పుతున్నా.. వాటిని నియంత్రించేందుకు చట్టాలున్నా.. ప్రజల్లో అవగాహన కొరవడటం అవరోధంగా మారింది. ఎవరికి వారే తమకెందుకులే అనే ధోరణిలో ఉండటం వల్ల.. ఈ దందా కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అడుగడుగునా కొనుగోలుదారులను ఏమార్చి దోచుకుంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు
- అధిక ధరకు అమ్మకాలు
- నాణ్యతా, ప్రమాణాలు పాటించని వైనం
- నష్టపోతున్న వినియోగదారులు
- ఫిర్యాదులుంటేనే చర్యలంటున్న అధికారులు



కడప రైతు బజారు



రైతు బజారులో కాటాపై ఖాళీ డబ్బానే తూకం సూచిస్తున్న దృశ్యం





కడప అర్బన్/ కోటిరెడ్డిసర్కిల్: ప్రతి ఒక్కరూ ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు నిత్యావసర సరుకులు, వస్తు సామగ్రి కొనుగోలు చేయాలన్నా.. వినియోగించుకోవాలన్నా ఒక్క క్షణం ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ వస్తువు ఎక్కడ కల్తీ జరుగుతుందో, ఎక్కడ నాణ్యత లోపించిందో కనిపెట్టలేని దుస్థితి. నిత్యం ఉపయోగించే పాలు, పెరుగు, కూరగాయలు, గ్యాస్ సిలిండర్లు, వాహనాలకు ఉపయోగించే పెట్రోలు, డీజిల్, మాంసంగా వినియోగించే చికెన్, మటన్, చేపలు, కోళ్లు తదితర వాటి గురించి తెలుసుకుని కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఏ వస్తువు కొందామన్నా అధిక ధరలైనా ఉంటాయి.. లేదంటే నాణ్యతా లోపం ఉంటుంది. పై వాటిల్లో ఏ వస్తువు వినియోగించినా ఆరోగ్యంగా ఉంటామన్న గ్యారంటీ కూడా లేదు. ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకవేళ తెలుసుకుని ఫిర్యాదు చేసినా, రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి తమతో పాటు నడిస్తేనే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతుండటం గమనార్హం. దీంతో తమకెందుకులే అనుకుంటూ 'ఏదో కొంటున్నాం.. తింటున్నాం' అని వినియోగదారులు కాలం గడిపేస్తున్నారు.

రైతు బజారులో..

ఉదయం రైతు బజారుకు వెళితే అక్కడ తూనికలు, కొలతలు శాఖ వారు నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఎలక్ట్రానిక్ యంత్రాలు ఉన్నప్పటికీ.. వాటిని సరిచేయడంలో లోటుపాట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కూరగాయలు కొనే వినియోగదారులు ఎవరికీ ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి. ఆకు కూరలు, కూరగాయలు నాణ్యతా ప్రమాణాలు లేకపోయినప్పటికీ అవసరానికి వినియోగదారులు తీసుకు వెళుతుండడం గమనార్హం. రైతు బజారులో 128 దుకాణాలు లైసెన్స్ కలిగి ఉంటే.. ఆ మేరకు దుకాణాలు కూడా ఉన్నాయి. అయితే ఈ దుకాణాల నిర్వాహకులు మాత్రం అధికంగా దళారులే ఉన్నారు. వీరిలో కేవలం 10 శాతం, అంత కంటే తక్కువగా రైతులు ఉన్నారు. ఏరోజు కారోజు ధరల పట్టికను ప్రదర్శించాల్సిన అవసరం అక్కడున్న ప్రతి దుకాణదారుడికి ఉంది. కానీ, కొన్ని చోట్ల ఈ ధరల పట్టికను ప్రదర్శించకపోవడం గమనార్హం. నిర్దేశించిన ధరల పట్టికల కింద రైతు బజారు ఇన్‌స్పెక్టర్ సంతకం ఉండాలి. కానీ అవేమీ అక్కడ కనిపించలేదు. రైతు బజారు బయటి వైపున ఓ దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా కంజు పిట్టలను పెంచుతూ యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కంజు పిట్టలను విక్రయించడం నిబంధనల మేరకు ఉందా? అని అటవీశాఖ అధికారులను ప్రశ్నించగా, వారు మాత్రం బాయిలర్ కోళ్ల ఫారం మాదిరిగా పెంచుకుంటే సరే కానీ, అడవిలో నుంచి తీసుకొచ్చి పెంచే నిబంధన లేదన్నారు. అలా ఎవరైనా చట్ట వ్యతిరేకంగా కంజు పిట్టలను పెంచి విక్రయిస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అలాగే చేపల దుకాణం వద్ద ఐస్‌బాక్సులలో చేపలను పెట్టి విక్రయిస్తున్నారు. ఆ చేపలు తాజాగా తీసుకొచ్చి పెట్టారా? లేక రెండు లేదా మూడు రోజుల నుంచి అలాగే ఉంచారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.



కడపలో బాటిల్‌కు పెట్రోలు పడుతున్న సిబ్బంది

▶▶ మేలుకో.. హక్కులు తెలుసుకో..



వినియోగదారుడు 'మేలు'కొనాలి. వస్తువుల ధర, పరిమాణం, తయారీ, తేదీ, తయారీ కంపెనీ అడ్రస్ వంటివి చూసుకోవాలి. అలాగే బిల్లు పొందాలి.

- జిల్లాలో వినియోగదారుల హక్కులను సంరక్షించేందుకు వివిధ శాఖల వారు తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు న్యాయం చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని తెలియజేస్తున్నారు.
- జిల్లా కేంద్రమైన కడపలో పాత కలెక్టరేట్ ఆవరణలో వున్న వినియోగదారుల ఫోరం 1993 నవంబర్‌లో ప్రారంభించారు. అప్పటి నుంచి దాదాపుగా 8 వేలకుపైగా ఫిర్యాదులు అందాయి. గతేడాది 120 ఫిర్యాదులు, ఈ ఏడాది 30 ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటి వరకు 170 ఫిర్యాదులకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- జిల్లాలో వినియోగదారుల హక్కులను సంరక్షించేందుకు తూనికలు, కొలతలశాఖ వారు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అగ్రికల్చర్, రెవెన్యూ, ఆహార నాణ్యత, భద్రత విభాగాల అధికారులు, సిబ్బంది తమకు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వాటిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నారు. వినియోగదారులలో చాలా మంది తమకు జరిగిన అన్యాయాన్ని వెంటనే రుజువులతో సహా ఫిర్యాదు చేయాలని అధికారులు కోరుతున్నారు. రాతపూర్వకమైన ఫిర్యాదులు బాధితుల ద్వారా అందకపోయినా పై శాఖల వారు ఏమి చేయలేని పరిస్థితుల్లో ఉండటం గమనార్హం.



ఆర్టీసీ బస్టాండ్‌లో సమోసాలపై ఈగలు వాలే అవకాశం ఉన్నా.. అలాగే ఉంచిన వ్యాపారి

▶▶ నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం



మార్చి 15 (శనివారం) ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం. ఈ నేపథ్యంలో వినియోగాదారులను చైతన్యం చేసేందుకు 'సాక్షి' ప్రయత్నించింది. వారికి జరుగుతున్న నష్టాలపై 'సాక్షి' బృందం శుక్రవారం ప్రత్యక్ష పరిశీలన చేసింది. నమూనాగా జిల్లా కేంద్రమైన కడప నగరంలోని రైతు బజార్, ఆర్టీసీ బస్టాండ్, పెట్రోల్ బంకులను ఎంచుకుంది. అక్కడ పలు మోసాలు కనిపించాయి. దాదాపుగా అన్ని చోట్ల ఇదే తంతు కొనసాగుతోంది.

▶▶ ఆర్టీసీ బస్టాండులో..

కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండులో క్యాంటీన్, హోటళ్ల కంటే తినుబండారాలు, కూల్ డ్రింక్ షాపులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రతి వాటర్ బాటిల్‌పై ముద్రించిన రేటు రూ.20–25 ఉంటే రూ.5–10 అధికంగా వసూలు చేస్తున్నారు. చిన్నచిన్న ప్యాకెట్లలో వేరుశనగ, సన్‌ఫ్లవర్, బఠానీలు, ఉప్పు శనగలను లోకల్ ప్యాకింగ్ చేసి, ఎలాంటి ఆహార భద్రతా ప్రమాణాలను పాటించకుండా ప్రయాణికులకు విక్రయించేస్తున్నారు. ఓ వ్యక్తి తన భార్య, కుమార్తెను బస్సు ఎక్కించేందుకు వచ్చిన సమయంలో బిందు అనే పెట్ కూల్‌డ్రింక్ బాటిల్‌ను కొనుగోలు చేస్తే.. దానిపై ఉన్న ధర కన్నా రూ.10 అదనంగా తీసుకున్నారు. సమోసాలు తయారు చేసి అలాగే బయట ప్రదర్శించే లాగా పెట్టి అమ్ముతున్నారు. ఆ సమోసాలకు ఈగలు, దోమలు, దుమ్ముధూళి పడినా పట్టించుకోకుండా అమ్మడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే బస్టాండులో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్ల వద్ద ఎంత వసూలు చేసేది నిర్ణయించే ధరల పట్టికను ప్రదర్శించలేదు. ప్రయాణికుల నుంచి ఇష్టానుసారంగా డబ్బులను వసూలు చేస్తున్నారు. పెట్రోలు బంకు వద్ద లీటరు బాటిల్ తీసుకెళ్లి లీటరు పెట్రోలును కొనుగోలు చేస్తే 10–20 ఎంఎల్ వరకు తక్కువగా వచ్చింది. ఇలా ప్రతి లీటరులో 10–20 ఎంఎల్ పెట్రోలును కాజేస్తూ వినియోగదారులను కొందరు పెట్రోలు బంకు యాజమాన్యం నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు.

ఒక్కొక్కరు ఒక్కో రేటుకు విక్రయం



రైతు బజారులో విక్రయిస్తున్న కూరగాయల ధరల్లో తేడాలు ఉన్నాయి. ఒకే ధరకు ఎవరూ కూడా అమ్మడం లేదు. ఏదైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఇక్కడ రైతులు మాత్రమే కూరగాయలు అమ్ముకోవాలి. రైతులు ఎవరూ కూడా లేరు. –నాగరాజు, రిటైర్డ్ ఉద్యోగి, హౌసింగ్‌బోర్డు కాలనీ, కడప

అధికారుల పర్యవేక్షణ అవసరం



రైతు బజారులో స్టాల్‌లోని బోర్డులోని ధరకు, వాస్తవానికి హెచ్చుతగ్గులు ఉన్నాయి. అధికారులు నోటీసు బోర్డులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారు. విక్రయాలపై పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – శేషు, కడప

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



రైతు బజారులో అధిక ధరకు విక్రయిస్తున్నారని నేను ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారులకు వ్యాపారులతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయో తెలియదు. – కృష్ణారెడ్డి, వివేకానందనగర్, కడప

బస్టాండులో దోపిడీ



కడప ఆర్టీసీ బస్టాండులో నిలువుదోపిడీ కొనసాగుతోంది. చివరికి మంచినీటి బాటిళ్లను కొన్నా అధిక మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. ఈ విషయంగా ప్రశ్నిస్తే ఏవేవో కారణాలు చెబుతున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. – నరేంద్ర, ప్రయాణికుడు, కడప

తూకాల్లో మోసం చేస్తే చర్యలు



దుకాణదారులు తూకాల్లో మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు. వినియోగదారులకు నాణ్యతా ప్రమాణమైన సరుకులను అందించి ఎమ్మార్పీకే అమ్మకాలను సాగించాలి. దుకాణదారులు కచ్చితంగా తూకాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. వినియోగదారులకు ఏవైనా సందేహాలుంటే మాకు ఫిర్యాదు చేయవచ్చు. – రవీంద్రారెడ్డి, జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్, తూనికల కొలతలశాఖ

న్యూస్‌రీల్

నేటి నుంచి ఒంటి పూట బడి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని గవర్నమెంట్, జిల్లా పరిషత్, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలను ప్రధానోపాధ్యాయులు ఈ నెల 15వ తేదీ (శనివారం) నుంచి ఒక్క పూట మాత్రమే నిర్వహించాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 7.45 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. అయితే ఎక్కడైతే పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్నాయా.. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించాలని వివరించారు.

వైభవంగా రామయ్య పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శుక్రవారం సీతారాముల పౌర్ణమి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూల మాలలతో అలంకరించారు. అర్చకులు వీణా రాఘవాచార్యులు, వీణా మనోజ్ కుమార్‌లు కల్యాణ క్రతువును నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ ప్రధాన కార్యదర్శిగా కె.రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శులుగా ఎస్.జఫ్రుల్లా ముల్లపల్లి, సి.షేక్ ఖాజా మోహిద్దీన్, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా ఎస్. ముల్లాజానీ, రాష్ట్ర ఐటీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా సగిలి రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ వింగ్ కార్యదర్శిగా అల్లం సత్యనారాయణ, రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా ఆకుల రవికుమార్‌లను నియమించారు.

చంద్రబాబుకు అనైతిక రాజకీయాలు అలవాటే

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజా దర్బార్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: చంద్రబాబుకు అనైతిక రాజకీయాలు చేయడం అలవాటేనని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ మాట్లాడారు. ఎన్నికల ప్పుడు అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత బుట్టదాఖలు చేయడం ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ప్రజలు కూడా చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోయామని పునరాలోచించుకుంటున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలకు జగనన్న శ్రీకారం చుడితే.. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం వాటిని ప్రైవేట్‌పరం చేయాలని చూస్తుండటం దారుణమన్నారు. అలాగే రైతన్నలకు అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను జగన్‌మోహన్‌రెడ్డి ఎండగడతారనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కల్పించకుండా కుట్రలు చేస్తున్నారన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

టీడీపీలోనే అసాంఘిక శక్తులు

- జూదం ఆడిస్తూ పట్టుబడిన వ్యక్తి వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాదు
- అశోక్‌రెడ్డి టీడీపీ 24వ డివిజన్ ఇన్‌చార్జి
- లక్ష రూపాయలు పెట్టి టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు
- మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా



టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవితో అశోక్‌రెడ్డి ఉన్న ఫొటోలను మీడియాకు చూపుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీలో కొన్ని అసాంఘిక శక్తులు పని చేస్తున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ఆరోపించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులే గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లు నిర్వహిస్తూ ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని విమర్శించారు. జూదం ఆడిస్తున్నారనే కారణంతో రెండు రోజుల క్రితం రాజారెడ్డి వీధికి చెందిన అశోక్ రెడ్డి అనే వ్యక్తిని అన్నమయ్య జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. అతను వైఎస్సార్‌సీపీ నాయకుడని అని కొన్ని పత్రికల్లో కథనాలు రావడం దురదృష్టకరమన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అతను వైఎస్సార్‌సీపీ నాయకుడని రాయడం సరికాదన్నారు. రాజారెడ్డి వీధికి చెందిన అశోక్ రెడ్డి పక్కా తెలుగుదేశం పార్టీ నాయకుడని, లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో సీఎస్ఐ స్కూల్‌లో టీడీపీ తరఫున ఏజెంట్‌గా కూర్చొన్నారని, కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డికి ముఖ్య అనుచరుడన్నారు. లక్షలు, లక్షలు చేతులు మారుస్తూ జూదం ఆడించే గ్యాంబ్లర్‌కు 41ఏ నోటీసులిచ్చి వదిలేయడం వెనుక ఎవరి హస్తం ఉందో వెలికి తీయాలన్నారు. గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, గంజాయి సరఫరా చేసే వారికి కూడా ఇలానే నోటీసులిచ్చి వదిలేస్తారా.. పోలీసులు దీనికి సమాధానం చెప్పాలన్నారు. జిల్లాలో ఏది జరిగినా వైఎస్సార్‌సీపీపై బురదజల్లడం ఆనవాయితీగా మారిందన్నారు. భూదందాలు ఎవరు చేస్తున్నారు, మట్టి, ఇసుక మాఫియా ఎవరి చేతుల్లో ఉందనేది జగమెరిగిన సత్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చట్టం ముందు తన, మన అనే భేదం లేకుండా పాలన సాగిందన్నారు. వైఎస్ కొండారెడ్డి కాంట్రాక్టర్‌ను బెదిరిస్తే తన బంధువైనా సరే వైఎస్ జగన్ సహించలేదని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో మాత్రం అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారిని ప్రోత్సహిస్తున్నారని, సామాన్యులకు ఒక న్యాయం, టీడీపీ వారికి మరొక న్యాయం అనే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. భూ ఆక్రమణలకు పాల్పడున్న వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, తోటక్రిష్ణ, రమేష్‌రెడ్డి, షఫీ, గుంటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



వికలాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

కడప సెవెన్‌రోడ్స్: ఏపీ శారీరక వికలాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘానికి కొత్త కార్యవర్గ ఎన్నిక శుక్రవారం కడప నగరంలోని విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా బి.సుధాకర్, అధ్యక్షుడిగా పులిమి జేమ్స్, ప్రధాన కార్యదర్శిగా చిన్నకొట్టి చంద్ర, ట్రెజరర్‌గా బత్తుల చంద్రశేఖర్, సమాచార కార్యదర్శిగా పి.సుబ్బరాజు, కార్యదర్శులుగా వై.గుర్రప్ప, హెచ్. నరసింహులు, కన్వీనర్‌గా ఎం.రవిశంకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.యల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ శారీరక వికలాంగ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ సంఘం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు.



క్లుప్తంగా

రైలు కిందపడి విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ

ముద్దనూరు : మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో రైలు క్రింద పడి భీంచెర్ల శివారెడ్డి(90) శుక్రవారం మృతిచెందాడు. యర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్ రెడ్డి సమాచారం మేరకు మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన శివారెడ్డి ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందాడు. శుక్రవారం సాయంత్రం రైలు క్రింద పడి మరణించాడని తెలిపారు. కేసు నమోదు చేసి కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

మిద్దెపై నుంచి పడి గాయాలు

మదనపల్లె : మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం ఉదయం పట్టణంలో జరిగింది. నక్కలదిన్నెకు చెందిన వెంకటరమణ(62) మిద్దెపై ఆరబోసిన మిరప కాయలను కిందకు తెచ్చేందుకు వెళ్లాడు. కిందకి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

23న మాలల సింహగర్జన

రాజంపేట రూరల్ : తిరుపతిలో ఈ నెల 23న ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ రాయలసీమ మాలల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు రాయలసీమ మాలల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విరుద్ధంగా ప్రధాని మోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిందన్నారు. మాలలు అంతా ఏకమై సింహగర్జనలో దీనిని వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో ప్రభాకర్, సంజీవ్, ధన శేఖర్, పూలమరెడ్డి మల్లికార్జున, చిరంజీవి, జనార్దన, సుబ్బనరసయ్య, సుబ్బయ్య, దండ ప్రసాద్, కాంతయ్య, కే.హరినాథ్, రవిశంకర్, రైటర్ పుండ్రిక, కె.సుధాకర్, ఒ.పెంచలయ్య, కన్నయ్య, శ్రీను, మనోహర్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో బంగారు భవిత

- పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- పదో తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- మార్చి చివరకు ముగియనున్న పది పరీక్షలు



కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 27 వేల మంది పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది 161 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారు. ఈ నేపథ్యంలో పది విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలీసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే నోటిఫికేషన్ విడుదల చేసింది. పది పరీక్ష రాసే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఎంట్రెన్స్ పరీక్షలో లభించిన ర్యాంకు మేరకు పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు లభిస్తాయి. ఈ ఏడాది మార్చిలోనే పాలీసెట్ నోటిఫికేషన్ విడుదల చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం

గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. వీరికి తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలీసెట్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సులో చేరి విలువైన సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు.

కోర్సుల వివరాలివీ..

పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్, మెకానికల్, సివిల్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటి) మెటలాజికల్ ఇంజినీర్(ఎంఈటి) కోర్సులు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో కడప, పొద్దుటూరు, వేంపల్లి, సింహాద్రిపురం, జమ్మలమడుగు, మైదుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల పరిధిలో దాదాపు 3800 సీట్లు ఉన్నాయి. ఇందులో కడపలో ప్రత్యేకంగా మహిళా పాలిటెక్నిక్ ఉంది. ఈ కోర్సు కాల వ్యవధి మూడు సంవత్సరాలు. దీనిలో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు. పాలిసెట్ ఎంట్రన్స్‌లో క్వాలిపై మార్కులు 35గా నిర్ణయించారు.

పాలీసెట్ నోటిఫికేషన్ ఇలా...

దరఖాస్తుకు గడువు	: ఏప్రిల్ 15
ప్రవేశ పరీక్ష	: ఏప్రిల్ 30
ఫలితాల వెల్లడి	: మే 10
కౌన్సెలింగ్ ప్రారంభం	: జూన్‌లో

పాలీసెట్ నోటిఫికేషన్ ఇదీ..

పాలీసెట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో ఏప్రిల్ 15వ తేదీలోపు పాలీసెట్ అప్లికేషన్ సబ్‌మిట్ చేసుకోవాలి. ఏప్రిల్ 30న పరీక్ష ఉంటుంది. మే 10న ఫలితాలను ప్రకటిస్తారు. జూన్‌లో ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. పరీక్ష 120 మార్కులకు ఉంటుంది. గణితంలో 50, ఫిజిక్స్‌లో 40, కెమిస్ట్రీలో 30 మార్కులకు ప్రశ్నలు పదో తరగతి సిలబస్ ఆధారంగా ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ,బీసీ విద్యార్థులు రూ.400 పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

ఎన్నో ఉద్యోగావకాశాలు...



పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ చేస్తే చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కళాశాలల్లో తరచూ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు మూడేళ్లు ఉంటుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ సెకండియర్‌లో చేరవచ్చు. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్.జ్యోతి, ప్రిన్సిపల్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, కడప

కృష్ణంపల్లెలో మద్యం జోరు



కృష్ణంపలెలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపు

దువ్వూరు మండలం కృష్ణంపల్లెలో ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న అధికార పార్టీ నేతలు కొందరు మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా తెరిచారు. ఇళ్ల మధ్యలోనే తమ ఇష్టం వచ్చినట్లు మద్యం విక్రయిస్తున్నారు. ఇళ్ల మధ్యలో ఉండడంతో తాము ఇబ్బంది పడుతున్నామని అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. – దువ్వూరు

జ్యోతిక్షేత్రంపై ఉక్కుపాదం మోపడం అన్యాయం

కలసపాడు : ఎందరో అభాగ్యులు, అనాథలకు ఆశ్రయమిస్తూ ఆకలి తీరుస్తున్న వైఎస్సార్ జిల్లాలోని జ్యోతి క్షేత్రంపై ఉక్కుపాదం మోపడం అన్యాయమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతంలోని వేలాది అభాగ్యులకు ఆపన్నహస్తంగా మారిన ఆశ్రమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి సరికాదన్నారు. జ్యోతి క్షేత్రాన్ని ఒక అనాథల నిలయంగా, సామాజికసేవా ఆలయంగా, అభాగ్యుల పాలిట ఆపన్నహస్తంగా చూసి అనుమతులు ఇవ్వాలన్నారు. అటవీ అధికారులు కూలగొట్టిన భవనాలను నిర్మించడమేగాక, ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇప్పించి ప్రభుత్వ పెద్దలు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా ఏ క్షేత్రంపై లేని వివక్ష జ్యోతిక్షేత్రంపై మాత్రమే ఎందుకు చూపుతుందో అర్థం కావడం లేదన్నారు.

కక్ష సాధింపుతోనే చికెన్ దుకాణానికి నిప్పు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



కాలిన చికెన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : కక్ష సాధింపుతోనే కొందరు వ్యక్తులు వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరేష్ కుమార్ చికెన్ దుకాణానికి నిప్పు పెట్టారని మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో నరేష్‌కుమార్ గత కొద్ది రోజులుగా చికెన్ సెంటర్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఇటీవల వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేశారు. ఇది ఓర్వలేని కొందరు వ్యక్తులు శుక్రవారం అతడి చికెన్ దుకాణానికి నిప్పు పెట్టారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నరేష్ కుమార్ పార్టీ కోసం చాలా కష్టపడడం ఓర్వలేక ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. బాధితుడికి వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. బాధితుడు నరేష్‌కుమార్ మాట్లాడుతూ దుకాణంలో సుమారు 300 కోళ్లు, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయని, దాదాపు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. అనంతరం నరేష్‌కు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బహదూర్, రామక్రిష్ణ, రఘునందన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేయి కిలోమీటర్లు ఎగిరిన పావురం



రికార్డు సృష్టించిన పావురాన్ని చూపుతున్న శివప్రసాద్‌రెడ్డి

సింహాద్రిపురం : పక్షులను ప్రేమించే వారు ఎక్కువగా పావురాలను పోషిస్తుంటారు. పక్షుల ప్రేమికులను ప్రోత్సహించడానికి కొందరు పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది నిర్వహించిన పావురాల పోటీల్లో వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురానికి చెందిన శివప్రసాద్‌రెడ్డి పావురం ప్రథమ స్థానంలో నిలిచి భళా అనిపించింది. ఏపీ హోమింగ్ పిగియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ ఏడాది మధ్యప్రదేశ్‌లోని భోపాల్ డివిజన్‌లో గత నెల 22న పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో 159 పావురాలు పాల్గొనగా, ఇందులో శివ ప్రసాద్ రెడ్డి పావురం స్టేట్ లాంగ్ డిస్టెన్స్ ఛాంపియన్‌గా నిలిచింది. 700 కిలోమీటర్ల రేస్‌లో, ఆకాశ మార్గాన 1000 కి.మీ రేస్‌లోనూ మొదటి స్థానంలో నిలిచింది. పావురం యజమాని శివ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నేను 200 పావురాలను పెంచి పోషిస్తూ ఉన్నాను. వాటిలో ఈ పావురం చురుకుగా ఉంటుండడంతో భోపాల్‌కు పంపానని, అక్కడ స్టేట్ ఛాంపియన్‌గా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పక్షులపై జాలి, ఆదరణ చూపితే అవి యజమానిని అంటిపెట్టుకొని ఉంటాయన్నారు.

భార్యా, పిల్లలను నిర్బంధించారు

– కడప వాసి ఆవేదన

కడప అర్బన్ : తన భార్య, పిల్లలను బాకీ డబ్బుల కోసం నిర్బంధించారని రాంబాబు అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. వేంపల్లికి చెందిన రాంబాబు కడప జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఈజీ. అశోక్‌కుమార్‌ను కలిసేందుకు వచ్చారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో విలేకరులతో రాంబాబు మాట్లాడుతూ చక్రాయపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి తన భార్య గంగాదేవి రూ.45లక్షలు రూ.2కు వడ్డీకి తెచ్చి కార్పొరేషన్‌కు బదలాయించి వడ్డీలకు ఇచ్చిందన్నారు. అనంతరం ఆ డబ్బు చెల్లించలేదంటూ వారు తన భార్య, పిల్లలను తీసుకెళ్లి చక్రాయపేట వాసులు వారి ఇంటి వద్ద పెట్టుకున్నారన్నారు. వెంటనే తన భార్య, పిల్లలను తనకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై వేంపల్లి, చక్రాయపేట పోలీసులకు ఇప్పటికే తెలిసినా పట్టించుకోలేదని సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES

■ VEHICLES FOR SALE AP39 QU8621-TVS STAR CITY PLUS /2022,AP39MD2460-HONDA SHINE DRUM /2021, AP39 RV9650-HERO HF DELUX/2022, AP39RV 1348- HERO HF DELUX /2022, AP39 TT 6246-ASHOK LEY LAND BADA DOST/2021. Models for sale in as is where is condition.Kanakadurgafinance. PH: 8522940999

REALSTATE

PLOT FOR SALE

■42 నెలల సులభ వాయిదా పద్ధతిలో ప్లాట్లు అమ్మకానికి కలవు. 0% వడ్డీ, తిరుపతి IIT & IISER కి సమీపంలో, స్పాట్ రిజిస్ట్రేషన్. 9000637999, 8801501376.

LAND REQUIRED

■బద్వేల్ నెల్లూరు హైవేలో CENTURY PLY WOOD ఫ్యాక్టరీ & పెద్ద పోలు కుంట మధ్యలో 30-50 సెంట్లు స్థలం కొనుగోలుకు కావలెను. సంప్ర: 8885559435

SERIVCES

PERSONAL CARE

CHANGE OF NAME

■ MALLU SUBBAIAH S/O MALLU SUBBARAMAIAH (OLD NAME), P.P.NO E5345989 R/O SEETHA RAMAPURAM (V) (P) RAJAMPETA (M) ANNAMAYYA (DT) AP HEREBY CHANGED MY NAME AS MALLU SUBBAREDDY S/O LATE SUBBARAMAIAH (NEW NAME)

■ I, PAMURU KALAVATHI W/O PAMURU LAKSHMI NARAYANA (OLD NAME), R/O. PATCHAVARI PALLI, PULLAMPET (M), ANNAMAYYA (DT), A.P., HEREBY CHANGED MY NAME AS PAMURI KALAVATHI, W/O PAMURI LAKSHMI NARAYANA (NEW NAME).

■I, THUPALLE RAMADEVI(old name), W/o THUPALLE VENKAT RAMANA REDDY, R/o. 4-118/1 Upstairs, Deguva veedhi, Nayunicheruvu Palli, Kalikiri Mandal, Annamayya Dist., Andhra Pradesh, Pin. 517 237. I changed my name to THUPALLI RAMADEVI, W/o THUPALLI VENKATARAMANA REDDY. Henceforth, I will be known as THUPALLI RAMADEVI.

■ I, THUPALLE VENKAT RAMANA REDDY (Old name), S/o THUPALLE NAGI REDDY, R/o. 4-118/1 Upstairs, Deguva Veedhi, Nayunicheruvu Palli, Kalikiri Mandal, Annamayya Dist., Andhra Pradesh,Pin.517237. I changed my name to THUPALLI VENKATARA MANA REDDY, S/o. THUPALLE NAGI REDDY. Henceforth, I will be known as THUPALLI VENKATARAMANA REDDY.

HOME CARE SERVICE

■లలిత హోం కేర్ సర్వీస్, విజయవాడ. వృద్ధులకు, పేషంట్ల సేవకు ఇంటిపని / వంట పని / బేబీకేర్ కొరకు M/F వర్కర్లను 24/7 మీ ఇంటికి పంపగలము. 97054 91122, 94932 46482

WANTED

■ మురళీ శారీ మందిర్ లో పనిచేయుటకు సేల్స్‌మెన్ & ఉమేన్స్, హెల్పర్-15, కంప్యూటర్ ఆపరేటర్-2(tally) కావలెను. జీతం:10-20 వేలు 9248941444

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజీలు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

■నెల్లూరులో ఫ్యాక్టరీ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను.జీ:14000,PF, ESI రూమ్ వసతి కలదు. సంప్ర: శ్రీ రాజ రాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్. 8008202789, 7032559538.

■ Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini.2 to 3yrs experience in tally. Salary 20,000/- to 25000/- Cont: 9133399257

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639663, 8977639662

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135

■ సెక్యూరిటీ సిబ్బంది కావలెను. 10th, Inter పాస్ అయిన వారికి 20,000/- మాజీ సైనికులకు 30,000/- సంప్ర: 9963704460, 8978827181

సాక్షి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి

9705907418

9705944423

9010223797

9010072409

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్లేషణగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేటా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విషద్రావణం తాగి విద్యార్థిని ఆత్మహత్య





మృతి చెందిన అక్షయ, అగ్రహం వ్యక్తంచేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని నాగులకట్ట వీధిలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్న అక్షయ(19) శుక్రవారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దముడియం మండలం కొండసుంకేసుల గ్రామానికి చెందిన అక్షయ పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ ఎస్సీ హాస్టల్‌లో ఉంటోంది. గురువారం రాత్రి వసతి గృహంలో విద్యార్థినుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడం, కాసేపటి తరువాత విద్యార్థినులు క్షమాపణలు చెప్పుకోవడం జరిగినట్లు తెలిసింది. అయితే శుక్రవారం మధ్యాహ్నం అందరూ భోజనం చేయడానికి వెళ్లగా అక్షయ మాత్రం వెళ్లలేదు. అప్పటికే తెచ్చుకున్న విష ద్రావణాన్ని(వాస్మోల్) తాగింది. విషయం తెలుసుకున్న వార్డెన్ బత్తుల ప్రభావతి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8.45 గంటల మధ్యలో చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

ప్రజా సంఘాల ఆగ్రహం

అక్షయ ఆత్మహత్యపై ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వసతిగృహానికి చేరుకొని విద్యార్థిని మృతికి హాస్టల్ వార్డన్ బత్తుల ప్రభావతి, సిబ్బంది కారణం అని హాస్టల్స్ ఏఎస్ డబ్ల్యూ గురుప్రసాద్, సీఐ లింగప్పకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది నవంబరు 7న కూడా వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు వాస్మోల్ తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు. సీఐ ఎస్.లింగప్ప వసతి గృహానికి వెళ్లి విద్యార్థినులను విచారించారు. దర్యాప్తు అనంతరం అక్షయ ఆత్మహత్య యత్నానికి కారణాలు తెలియజేస్తామని సీఐ తెలిపారు.

స్థలం వివాదంలో ఏడుగురికి జైలు

విశాఖ లీగల్: ఆస్తి విషయంలో ఒక వ్యక్తిని మోసం చేసిన ఏడుగురికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.18.60 లక్షల జరిమానా విధిస్తూ నగరంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం కమ్ 11వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.సత్యదేవి తీర్పు వెలువరించారు. పెందుర్తి పోలీస్ అధికారులు తెలిపిన వివరాలివీ.. వైఎస్సార్ జిల్లా బిట్రగుంట గ్రామానికి చెందిన పి.అప్పలరాజు 2014లో స్థలం కొనుగోలు చేయాలని భావించి పలువురిని సంప్రదించారు. దీనిని అవకాశంగా తీసుకున్న పిల్ల అర్జున్ మరో తొమ్మిది మందితో కలిసి మోసపూరితంగా కుట్ర పన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 158.88 చదరపు గజాల స్థలం కొనుగోలుకు అప్పలరాజు నుంచి రూ.18 లక్షలు వసూలు చేశారు. అయితే అదే స్థలాన్ని వేరే వారికి కూడా విక్రయించినట్లు 2017 ఫిబ్రవరిలో అప్పలరాజు గుర్తించి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులు పిల్ల అర్జున్, కె.అంజలి రావు, ఎం.పెద్ద అప్పలరాజు, ఎం.మరిడయ్య, ఎం.రమణ, ఎం.గోవింద్, ఎం.రాంబాబు, ఎం.చిన్న మరిడయ్య, ఎం.సూరిబాబు, ఎం.అప్పలరాజులపై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 120తో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణ జరుగుతుండగా పిల్ల అర్జున్, ఎం.పెద్ద అప్పలరాజు, ఎం.అప్పలరాజు మృతి చెందారు. మిగిలిన ఏడుగురు నిందితులకు న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.18.60 లక్షల జరిమానా విధించారు. జరిమానా మొత్తాన్ని బాధితుడు అప్పలరాజుకు చెల్లించాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు.

గిరిజన మహిళపై దాడి

మదనపల్లె : భూ వివాదంలో కొందరు వ్యక్తులు తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని గిరిజన మహిళ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వెళితే న్యాయం చేయకపోగా, తనపైనే కేసు బనాయించారని ఆరోపించారు. ఆమె వివరాల మేరకు.. పట్టణంలోని చంద్రా కాలనీకి చెందిన కృష్ణా నాయక్, సునీత దంపతులు దినసరి కూలీలు. వారికి స్థానికుడు బాల్ రెడ్డితో స్థల వివాదం ఉంది. అదే స్థలంలో తాము నిర్మించుకున్న పునాదులను గురువారం సాయంత్రం కొందరు తొలగిస్తున్నారని చెప్పడంతో అక్కడకు వెళ్లినట్లు సునీత తెలిపారు. ఆ సమయంలో బాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తనపై కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారన్నారు. అపస్మారకస్థితిలో పడిన తనను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి తన చెల్లెలు చికిత్స అందించిందన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌పోలీసులు ఫిర్యాదు తీసుకోకుండా, బాల్‌రెడ్డి ఫిర్యాదుమేరకు తనపై కేసు నమోదుచేశారన్నారు.

కాశినాయన భవనాలు ప్రభుత్వమే పునర్నిర్మించాలి



కాశినాయన ఆశ్రమంలో కూల్చివేసిన కట్టడాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కాశినాయన : జ్యోతి క్షేత్రంలో అటవీ అధికారులు కూల్చివేసిన కాశినాయన ఆశ్రమ కట్టడాలను ప్రభుత్వమే పునర్నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్సార్ జిల్లా కాశినాయన ఆశ్రమంలో అటవీ అధికారులు కూల్చివేసిన కట్టడాలను శుక్రవారం వారు పరిశీలించి ఆశ్రమ నిర్వాహకులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ కరవు ప్రాంత రైతుల సహకారంతో మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న అన్నదాన ఆశ్రమంలోని కట్టడాలను అటవీశాఖ అనుమతులు లేవంటూ కూల్చివేయడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం గత డిసెంబర్‌లో ఇచ్చిన ఆదేశాలతోనే నిర్మాణాలను కూల్చివేశారని ఆశ్రమ నిర్వాహకులు చెప్పారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులతో కూల్చిన కట్టడాలను మంత్రి లోకేష్ తన సొంత డబ్బులతో నిర్మిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం సబబు కాదన్నారు. గత 12 ఏళ్లుగా నిలిపివేసిన ఆలయ నిర్మాణ పనుల ప్రారంభానికి వెంటనే అనుమతులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు తాము పండించిన ధాన్యంలో కొంత భాగం కాశినాయన పేరు మీద అన్నదాన సత్రానికి తరలిస్తుంటారని, వాటితోనే అన్నదాన కార్యక్రమం సజావుగా సాగుతోందన్నారు. ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న అన్నా క్యాంటీన్, డొక్కాసీతమ్మ భోజనాల కంటే ఎన్నో రెట్లు నాణ్యమైన భోజనం ఇక్కడ అందిస్తున్నారన్నారు. ఎంతో మంది నిరాశ్రయులు, ఒంటరి మహిళలు కాశినాయన ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారని, కూల్చివేయడం సరికాదన్నారు. స్వయం ప్రకటిత హిందూమత రక్షకుడు పవన్‌కళ్యాణ్ వారం రోజులుగా ఇలాంటి చర్యలు జరుగుతుంటే స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం పోరుమామిళ్ల మండల కార్యదర్శి భైరవ ప్రసాద్, బి.మఠం కార్యదర్శి సునీల్‌కుమార్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

లారీ దూసుకెళ్లి..భార్యాభర్తలు మృతి

- కుమారుడికి తీవ్ర గాయాలు
- పొలానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు



భార్యాభర్తలు చలమయ్య, లక్ష్మీదేవి (ఫైల్)



గాయపడిన వినోద్ కుమార్

మైదుకూరు : కష్టపడి పంట పండించే రైతులు ఆ భార్యాభర్తలు. రోజుమాదిరిగానే పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డుపై ఉండగా వేగంగా వచ్చిన లారీ వారిపై దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన భార్య, భర్తలు తిరిగిరాని లోకాలకు చేరారు. వారి కుమారుడు గాయాలతో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. చాపాడు మండలం తప్పెట ఓబాయపల్లెకు చెందిన పసుపులేటి చలమయ్య కుటుంబం 30ఏళ్ల కిందట మైదుకూరుకు వచ్చి స్థిరపడింది. పట్టణంలోని నంద్యాల రోడ్డు సీతారామాంజనేయనగర్‌లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు పెద్దకుమారుడు మల్లేష్‌కు వివాహం కాగా, రెండో కుమారుడు వినోద్ కుమార్ డిగ్రీ వరకు చదివి కడపలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ కంపెనీలో పనిచేస్తున్నారు. చలమయ్య మున్సిపాలిటీ పరిధిలోని కేశలింగాయపల్లె వద్ద ఉన్న పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వినోద్ వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. పొలంలో సాగు చేసిన పసుపు పంట ఆకు కోయడంతో దానిని తొలగించేందుకు శుక్రవారం భార్య, కుమారుడు వినోద్‌తో కలిసి చలమయ్య పొలానికి వెళ్లారు. పొలం పని అయిపోగానే సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ముగ్గురు మైదుకూరు-పోరుమామిళ్ల రహదారిపైకి చేరుకొని ఆటో కోసం ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో మాచర్ల నుండి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ వీరిపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో చలమయ్య (55), ఆయన భార్య లక్ష్మీదేవి (50) అక్కడికక్కడే మృతి చెందారు. వారి కుమారుడు వినోద్ కుమార్‌కు గాయాలవడంతో కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని అర్బన్ సీఐ హాసం పరిశీలించారు. వివరాలు తెలుసుకున్నారు. భార్యాభర్తల మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాల భటులు ప్రపంచస్థాయి పౌరులుగా ఎదగాలి



శిక్షణ పొందిన విద్యార్థులతో స్కౌట్‌మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు

రాయచోటి అర్బన్ : బాలభటులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదగాలని స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి కోరారు. రాయచోటి పట్టణంలోని అర్చన కళాశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్స్ శిక్షణ ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపికైన 36 పీఎంశ్రీ పాఠశాలల నుంచి వచ్చిన 272 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను వివరించారన్నారు. రోడ్డుప్రమాదాలు జరిగి నప్పుడు ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రికి చేర్చడం, స్వచ్ఛందంగా సేవలందించడం, మంచి అలవాట్లను నేర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ లక్ష్మీకర్, హెచ్‌డబ్ల్యూఓ నిర్మల, ఓబులరెడ్డి, నాగరాజు, సుజాత, గోవిందమ్మ, స్వర్ణలత పాల్గొన్నారు.

చిలంకూరు పరీక్ష కేంద్రం తొలగింపు



చిలంకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు జెడ్పీ పాఠశాలలో పది పరీక్ష కేంద్రాన్ని ఈ ఏడాది తొలగించారు. గతంలో చిలంకూరులో పరీక్ష కేంద్రం ఉండడంతో ఆర్టీపీపీలోని డీఏవీ, సరస్వతి స్కూల్స్, చిలంకూరులోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులంతా పరీక్ష రాసేందుకు అనుకూలంగా ఉండేది. కూటమి ప్రభుత్వం రాగాననే చిలంకూరు పరీక్ష కేంద్రాన్ని తొలగించి యర్రగుంట్లకు మార్చివేశారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల విద్యాధికారి శివప్రసాద్ వివరణ కోరగా చిలంకూరులో సీ.కేంద్రం కావడంతో ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

ఆలయంలో మైక్ సెట్ చోరీ

మదనపల్లె : ఆలయంలో మైక్ సెట్ చోరీకి గురైన సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లె పంచాయతీ గాంధీపురంలోని కోదండరామస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయానికి అమర్చిన మైక్ సెట్‌ను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు చోరీ ఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైక్ సెట్ విలువ సుమారు రూ.11వేలు ఉంటుందని పేర్కొన్నారు. తాలూకా సీఐ కళావెంకటరమణ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

టిప్పర్ డ్రైవర్‌పై దాడి

మదనపల్లె : రాయచోటి నుంచి మదనపల్లెకు ఇసుక తీసుకుని వచ్చినందుకు టిప్పర్ డ్రైవర్‌పై మదనపల్లె టిప్పర్ అసోసియేషన్ సభ్యులు దాడి చేసిన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. రాయచోటికి చెందిన సుబ్రహ్మణ్యం టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాజంపేట రీచ్ నుంచి ఇసుక లోడ్ చేసుకుని, మదనపల్లెలో అన్‌లోడ్ చేసి తిరిగి రాయచోటికి వెళుతున్నాడు. చౌడేశ్వరి సర్కిల్ వద్ద అసోసియేషన్ సభ్యులు బిల్లప్ భరత్, పీఎస్ఆర్.ప్రసాద్‌రెడ్డి, అంకిశెట్టిపల్లె రమేష్, మణి, గొల్లపల్లెశివ, ముబారక్‌బాషా, ఏఎస్ఎస్ అమర తదితరులు బండిని అడ్డుకుని తాళాలు లాక్కోవడమే గాక, తనపై దాడిచేసి, చొక్కాను చించివేసి గాయపరిచారన్నారు. మదనపల్లెలో టిప్పర్ అసోసియేషన్ లారీలు తప్ప వేరెవ్వరూ తక్కువ ధరకు ఇసుక అమ్మరాదని, తాము రూ.24 వేలు అమ్ముతుంటే, నీవు రూ.18,500కు ఎలా దించుతావంటూ గదమాయిస్తూ విచక్షణారహితంగా కొట్టారన్నాడు. బాధితుడు టిప్పర్‌ను అక్కడే విడిచిపెట్టి, తెలిసిన వారి సహాయంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, సీఐ రామచంద్రకు ఫిర్యాదు చేశాడు. దాడి ఘటనపై విచారణ చేసి కేసు నమోదుచేస్తామని తెలిపారు.